క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కుటుంబాలు



కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: వైఎస్సార్‌సీపీ పేదల పక్షపాతి అని, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ఎన్నికల్లో విజయపథంలో నడిపిద్దామని ఎమ్మెల్యే అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. మెట్టపాలెం పంచాయతీ శివారు కసిరెడ్డిపాలెం టీడీపీకి చెందిన బర్ల సూరిబాబు, దేముడుల ఆధ్వర్యంలో 12 మంది ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు సుర్ల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ తాతబాబు, నాయకులు బండారు సింహాచలం, గ్రామ ఇన్‌చార్జి తాతాజీ, తమరాన సతీష్, సప్పా చిన్న పాల్గొన్నారు.

6 మద్యం సీసాలతో ఒకరు అరెస్టు

చోడవరం రూరల్: పట్టణంలోని చీడికాడ జంక్షన్ వద్ద ఆరు మద్యం సీసాలతోపాటు ఒకరిని అరెస్టు చేసినట్టు సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఉదయం ఎస్‌ఐ డి.శేఖరం తన సిబ్బందితో కలసి తనిఖీలు చేస్తుండగా చీడికాడ జంక్షన్ వద్ద ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా వి.మాడుగుల మండలం వీరవిల్లి అగ్రహారం గ్రామానికి చెందిన సుంకరి మహేష్‌కుమార్ (31) వద్ద ఆరు మద్యం సీసాలు లభించాయన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

డిగ్రీ కళాశాలలో ఉచిత కంప్యూటర్ శిక్షణ

మాడుగుల: స్థానిక డిగ్రీ కళాశాలలో ఈ నెల 15వ తేదీ నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ సి.వి.ఎస్.ఎస్ శాస్త్రి మంగళవారం తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు కోర్సులో చేరడానికి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కంప్యూటర్ శిక్షణతోపాటు, రిలయన్స్, సంతూర్ వంటి ప్రముఖ కంపెనీల స్కాలర్ షిప్ కోసం ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. ఇప్పటికే కళాశాల విద్యార్థులు ఇద్దరు స్కాలర్ షిప్‌కు ఎంపికయ్యారన్నారు.

దిగ్విజయంగా నిత్యాన్నదానం



కె.జె.పురం జంక్షన్‌లో నిత్యాన్నదాన కార్యక్రమం

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో సంతోషిమాత ఆలయం వద్ద నిత్యాన్నదాన కార్యక్రమం దిగ్విజయంగా రెండేళ్లు పూర్తి చేసుకుందని సంతోషిమాత ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు మంగళవారం తెలిపారు. దాతల సహకారంతో 2022 ఏప్రిల్ 2వ తేదీ ఉగాది పర్వదినం రోజున ఈ కార్యక్రమం ప్రారంభించామన్నారు. రోజూ వంద మందికి తక్కువ కాకుండా నిత్యాన్నదాన సత్రంలో బాటసారులు, చిరువ్యాపారులు, మాలాధారణ భక్తులు, పాల్గొంటున్నారని, దీనికి సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. సంతోషిమాత ఆలయంలో ప్రతి శుక్రవారం భక్తులకు అన్నదానం చేస్తున్నామని, ఈ కార్యక్రమం ప్రారంభించి 19 ఏళ్లు పూర్తయిందని తెలిపారు.

నేడు, రేపు ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ ప్రచారం

మాడుగుల రూరల్: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ ఈ నెల 3, 4 తేదీల్లో మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు వేమవరపు రామధర్మజ, ఎంపీపీ రాజారామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం ముకుందపురం, వీరవల్లి అగ్రహారం, పి.పి. అగ్రహారం, జి. అగ్రహారం, వీరనారాయణం, చింతలూరు, ఎం. కృష్ణాపురం, గాదిరాయి, మధ్యాహ్నం ఒమ్మలి, జాలంపల్లి, లోవపొన్నవోలు, అవురువాడ, కె.వల్లాపురం, కింతలి, పొంగలిపాక, వి.జె.పురం, జె.డి.పేట గ్రామాల్లో ప్రచారం చేస్తారన్నారు. గురువారం ఉదయం శంకరం, తాటిపర్తి, ఎం. కోడూరు, డి. గొటివాడ, సత్యవరం, జంపెన, సాగరం, మధ్యాహ్నం మాడుగుల, ఎ.కె. వల్లాపురం, ఎం. కోటపాడు, కె.జె.పురం, వంటర్లపాలెం గ్రామాల్లో పర్యటిస్తారని, పార్టీ శ్రేణులు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

పింఛన్‌దారుల గగ్గోలు



- పింఛన్ సొమ్ము అందకపోవడంతో ఆందోళన
- చంద్రబాబు నిర్వాకంపై ఆగ్రహం

టీడీపీ నిర్వాకంతో పింఛన్‌దారులకు కష్టాలు మొదలయ్యాయి. ఐదేళ్లపాటు ఇంటి వద్దే హాయిగా పింఛన్ సొమ్ము పొందేవారు. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్‌కు చంద్రబాబు ఫిర్యాదు చేయడంతో వలంటీర్ల సేవలు నిలిచిపోయాయి. దాంతో ఎప్పటిమాదిరిగానే ఈ నెల మొదటి తేదీన పింఛన్ సొమ్ము అందకపోవడంతో పింఛన్‌దారులు గగ్గోలు పెడుతున్నారు. మళ్లీ గత టీడీపీ పాలన కష్టాలు మొదలయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– నర్సీపట్నం/చోడవరం/మాడుగుల

చోడవరం నియోజకవర్గంలో మొత్తం పింఛన్‌దారులు

చోడవరం మండలంలో 13,491 మంది పింఛన్‌దారులకు ప్రతినెలా రూ.364.52 కోట్లు ప్రభుత్వం పింఛన్‌గా ఇస్తోంది. వీరిలో వృద్ధులు 7,258, వితంతువులు 3,700, దివ్యాంగులు 2,200, ఇతర పింఛన్‌దారులు 333 మంది ఉన్నారు. బుచ్చెయ్యపేట మండలంలో 10,953 మంది పింఛన్‌దారులకు రూ.302.45 కోట్లు అందిస్తోంది. వీరిలో వృద్ధులు 6,655, దివ్యాంగులు 1,504, వితంతువులు 2,360, ఇతర పింఛన్‌దారులు 286 మంది ఉన్నారు. రావికమతం మండలంలో 1,2491 మంది పింఛన్‌దారులకు రూ.345.37కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. రోలుగుంట మండలంలో 9,310 మంది పింఛన్‌దారులకు రూ.249.62 కోట్లు ప్రభుత్వం అందిస్తోంది. వీరిలో వృద్ధులు 4,700 మంది, దివ్యాంగులు 3,211, వితంతువులు 2,610, డీవర్ పింఛన్లు 1,060 మందికి, ఇతరులు 915 మంది ఉన్నారు.

నర్సీపట్నం నియోజకవర్గంలో..

నర్సీపట్నం మండలంలో మొత్తం పింఛన్‌దారులు 5,351, నర్సీపట్నం మున్సిపాలిటీలో 7,129, నాతవరంలో 11,250, గొలుగొండలో 8,792, మాకవరపాలెంలో 11,284 మంది లబ్ధిదారులు ప్రతి నెలా పింఛన్ పొందుతున్నారు.

మాడుగుల నియోజకవర్గంలో..

దేవరాపల్లి మండలంలో 11,813 మంది పింఛన్‌దారులు, చీడికాడలో 10,271, కె. కోటపాడులో 11,159, మాడుగుల మండలంలో 13,637 మంది ఉన్నారు. అన్ని రకాల పింఛనుదారులు 46,878 మందిలో 20 వేల మందికి పైగా సచివాలయాలకు దూరంలో ఉన్నారు.

మా ఉసురు తగులుతుంది...



అనారోగ్యంతో మంచానపడ్డ మాలాంటివారి ఉసురు చంద్రబాబుకు తగులుతుంది. గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ తీసుకునేందుకు నరకం చూసే వాళ్లం. పోలియో బారిన పడి మంచానికే పరిమితమయ్యాను. టీడీపీ హయాంలో పింఛన్ తీసుకునేందుకు పంచాయతీ కార్యాలయానికి వెళ్లేందుకు నరకం చూసేవాడిని. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక కష్టాలు తీరాయి. వలంటీర్ ప్రతి నెలా వేకువజామునే ఇంటి తలుపు తట్టి పింఛన్ ఇచ్చేది. ఇప్పుడు చంద్రబాబు నిర్వాకం వల్ల పింఛన్ కోసం మళ్లీ ఇబ్బందులు తప్పటం లేదు. కదలలేని పరిస్థితిలో నాలాంటి వారు సచివాలయానికి ఎలా వెళ్లగలరు. రాజకీయ స్వలాభం కోసం టీడీపీ వారు చేసిన ఫిర్యాదుతో మాలాంటి వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

– శానాపతి శ్రీనివాసరావు, చెట్టుపల్లి, నర్సీపట్నం మండలం


పింఛన్ సొమ్ము అందక..



గత టీడీపీ ప్రభుత్వంలో పంచాయతీ కార్యాలయాల వద్ద గంటలకొద్దీ వేచి ఉండి పింఛన్ తీసుకునేందుకు ఇబ్బంది పడేవాళ్లం. జగన్‌బాబు అధికారంలోకి వచ్చిన తర్వాత మా కష్టాలు గట్టెక్కాయి. వలంటీర్ల ద్వారా మా ఇంటి తలుపు తట్టి ఫస్ట్ తేదీన ఠంఛన్‌గా పింఛన్ సొమ్ము ఇస్తున్నారు. ఇప్పుడు టీడీపీ రాజకీయ స్వలాభం కోసం వలంటీర్లతో పింఛన్ పంపిణీ ఆపేయడం దుర్మార్గం. రెండో తేదీ గడిచినా పింఛన్ ఇచ్చే దిక్కులేదు. పింఛన్ అందక ఖర్చులు గడవక ఇబ్బందిగా ఉంది

– పోలుపర్తి నూకరాజు, దివ్యాంగుడు, రోలుగుంట

గత పాలన కష్టాలే వచ్చాయి...



వలంటీర్లు ప్రతినెలా ఒకటో తేదీన ఇంటికి వచ్చి పింఛన్ అందించేవారు. ఎన్నికల సమయంలో వలంటీర్ల సేవలు నిలిపివేయాలని టీడీపీ నేతలు కోర్టుకెళ్లారని తెలిసింది. దీనివల్ల పింఛన్‌దారులు ఇబ్బందులు పడుతున్నారు. 2014–19 వరకు పడిన కష్టాలే మరలా వచ్చాయి. వలంటీర్ వ్యవస్థతో ఎన్నో కుటుంబాలకు, పింఛన్‌దారులకు మేలు కలుగుతోంది. సీఎంగా మరలా జగన్‌మోహన్‌రెడ్డి వస్తేనే మా కష్టాలు తీరుతాయి.

– చింత్రాడ నాగు, దివ్యాంగ పింఛన్‌దారు, గొలుగొండ

వృద్ధులపై కుట్ర రాజకీయాలా?



ఒకటో తారీఖు వచ్చిందంటే వలంటీరు మా ఇంటి తలుపు తట్టి పింఛను ఇచ్చేవారు. ఈ నెల రారని, గ్రామ సచివాలయానికి వెళ్లి తీసుకోవాలని విన్నా. చంద్రబాబు ఫిర్యాదు చేయడంతో వలంటీర్లను పింఛన్ల పంపిణీ నుంచి దూరం పెట్టించారని, ఇప్పుడు పాత పద్ధతిలో పింఛను తీసుకోవాలట. అసలే ఎండలు, సచివాలయానికి వెళ్లి పింఛను తీసుకుంటాను. నేను కూడా చిరు వ్యాపారం చేసుకుంటున్నాను. కుట్రపూరిత రాజకీయాల వల్ల మాలాంటి వృద్ధులు ఎంతో ఇబ్బందులు పడతున్నాం.

– పినపాత్రుని జోగారావు, వృద్ధాప్య పింఛన్‌దారు, వీరవల్లి అగ్రహారం, మాడుగుల మండలం

పైడిపాల ఎల్లమంతన్నారు



పెతీనెల ఇంటి దగ్గరే పించినీ డబ్బు తీసుకునేదాన్ని. ఈ నెల నించి పైడిపాల పంచాతీపీసు కెల్లాలంతన్నారు. ఇంటి దగ్గరే మసల్లేకపోతన్నాను. ఇంక పైడిపాల ఎలాగెల్లాలో.. నాలాంటోల్లకోసం జగన్‌బాబు ఇంటికే పించినీ డబ్బులు అంపేటోడు. అలాటిడి ఈ నెల నుండి మూడు పర్లాంగులు దూరంలోని పైడిపాల పంచాతీపీసుకి ఎల్లి ఎలాగుండాలో.. పొద్దెక్కేటప్పిడికే బోరుగ ఎండకాసెత్తంది. ఇంక ఆడికెల్లి డబ్బులు ఎలా తీసుకోవాలో.. ఇంటికాడే డబ్బులియ్యండిబాబు.

– బొడ్డు అచ్చియ్యమ్మ, చామంతిపురం, మాకవరపాలెం మండలం

పింఛన్లు అడ్డుకున్న చంద్రబాబు, అయ్యన్న

ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్



పింఛనుదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్

నాతవరం: ఇంటింటికీ పింఛన్లు ఇవ్వకుండా టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, సీహెచ్ అయ్యన్నపాత్రుడే అడ్డుకున్నారని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ విమర్శించారు. లింగంపేట పంచాయతీలో మంగళవారం ఎమ్మెల్యే ప్రచారానికి విచ్చేశారు. తిరుగు ప్రయాణంలో కొత్త రామచంద్రపురం వి.బి.అగ్రహారం, బుచ్చెంపేట గ్రామాలకు చెందిన పింఛనుదారులు రోడ్డుపైకి వచ్చి ఆయన కారు చుట్టుముట్టారు. తమకు ఇంకా పింఛన్లు ఇవ్వలేదంటూ వాపోయారు. వెంటనే ఎమ్మెల్యే కారు దిగి వలంటీర్లు పింఛన్లు ఇవ్వడం, ప్రజలకు సేవ చేయడం ఓర్వలేక చంద్రబాబు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి అడ్డుకున్నారని ఆరోపించారు. పింఛన్లు సచివాలయంలోనే ఇస్తారని, రెండు నెలల్లో మరలా అధికారంలోకి వస్తామని, అప్పుడు ఇంటికే ఇస్తామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరెన్ని పథకాలు అందిస్తారని, అధైర్యపడొద్దంటూ భరోసా కల్పించారు. మేము సిద్ధం బస్సు యాత్రకు వస్తున్న ప్రజాదరణ చూసి జీర్ణించుకోలేక చంద్రబాబు జిమ్మిక్కులు, కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. మాజీ మంత్రి అయ్యన్న తనయుడు గ్రామాల్లో తమ పార్టీ నాయకులను బెదిరించడం వంటి నీచమైన పనులు చేస్తున్నారని ఆగ్రహించారు. వారికి ఓటు ద్వారా బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, వైస్ ఎంపీపీ పైల సునీల్, పార్టీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, సర్పంచులు రాము, బాబ్జి, నాయకులు అడిగర్ల నాయుడు, దేవాడ శ్రీను పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ పథకాల కొనసాగింపు



ఆర్.భీమవరంలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న జెడ్పీటీసీ రాంబాబు

బుచ్చెయ్యపేట: రాష్ట్రంలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలంటే మరలా రెండోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైఎస్సార్ సీపీ యువజన సంఘం అధ్యక్షుడు నియోజకవర్గ కరణం సూర్య కోరారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కరణం ధర్మశ్రీ, బూడి ముత్యాలనాయుడులకు మద్దతుగా పార్టీ నాయకులతో కలిసి మంగళవారం వారు ఆర్.భీమవరంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఐదేళ్లుగా వలంటీర్ల ద్వారా మొదటి తారీఖు ఇంటి వద్దే పింఛన్ సొమ్ము అందేదన్నారు. ఎన్నికలను బూచిగా చూపి టీడీపీ నాయకులు ఫిర్యాదుతో ఈ నెల పింఛన్ నగదు అందకుండా చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమ పథకాలు మరలా కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో రెండోసారి గెలిపించాలని కోరారు. నాయకులు అమ్మునాయుడు, నమ్మి అప్పలరాజు, సత్యనారాయణ, శానాపతి నాయుడు, గొంప అప్పారావు, సతీష్,రాజారావు పాల్గొన్నారు.

క్రిస్టియన్, మైనార్టీల సంక్షేమానికి ఎంతో కృషి

పాస్టర్ల సమావేశంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



పాస్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: క్రిస్టియన్, మైనార్టీల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. మంగళవారం చోడవరంలో పాస్టర్లతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో 200 మంది పాస్టర్లు పాల్గొన్నారు. వీరినుద్దేశించి ధర్మశ్రీ మాట్లాడుతూ నాడు రాజశేఖర్‌రెడ్డి హయాంలో మైనార్టీలకు ఎంతో మేలు చేయగా, నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని చెప్పారు. అర్చకులు, ఇమామ్, పాస్టర్లకు గౌరవ వేతనం ఇచ్చిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. నియోజకవర్గంలో పాస్టర్ల సంక్షేమానికి తన వంతుగా కృషి చేస్తానని, వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ నుంచి ఎంపీగా బూడి ముత్యాలనాయుడిని, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ధర్మశ్రీ కోరారు. ఈ సందర్భంగా పాస్టర్లంతా ప్రత్యేక ప్రార్థనలు చేసి ధర్మశ్రీని ఆశీర్వదించారు.

గిరిజన గ్రామాల్లో దోమల నివారణ చర్యలు



మాట్లాడుతున్న చోడవరం మలేరియా సబ్ యూనిట్ అధికారి రమణ

మాడుగుల రూరల్: గిరిజన గ్రామ పంచాయతీల్లో తొలి విడతగా దోమల నివారణ మందు స్ప్రేయింగ్ చేస్తున్నట్టు చోడవరం మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్.వి.రమణ తెలిపారు. మంగళవారం కె.జె.పురం పీహెచ్‌సీ ఆవరణలో ఆశ కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు కె.జె.పురం పీహెచ్‌సీ పరిధి తాటిపర్తి, శంకరం పంచాయతీల్లోని గిరిజన గ్రామాల్లో ఐ.ఆర్.ఎస్. ఎ.సి.ఎం 5 శాతం దోమల నివారణ మందును స్ప్రేయింగ్ చేస్తామన్నారు. దీనికిగాను ఆయా గ్రామాల ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు సహకరించాలన్నారు. వేసవిలో ప్రజలు తీసుకోవల్సిన ఆరోగ్య జాగ్రత్తలు గురించి సమీక్షించారు. వైద్యాధికారి కె.లీలాప్రసాదు, సీహెచ్‌వో సిహెచ్. పుష్పమ్మ, పీహెచ్ఎన్ ఇందిర, ఆరోగ్య పర్యవేక్షకుడు వెంకట్రావు, సహాయకుడు కిల్లో నీలాంబరం పాల్గొన్నారు.

ఎంపవర్ కమిటీ దృష్టికి తెస్తే పరిష్కారం



మాట్లాడుతున్న పీవో రత్నభారతి

చోడవరం రూరల్: విద్యార్థినులు ఎలాంటి సమస్యలనైనా కళాశాల ఎంపవర్ కమిటీ దృష్టికి తీసుకురావాలని ఉమెన్ ఎంపవర్‌మెంట్ కమిటీ కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీమంగమ్మ సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాలలో సీసీ కెమెరాల నిఘా ఉందని, ఎటువంటి సమస్య ఎదురైనా తమ దృష్టికి తీసుకొస్తే తగిన పరిష్కారం లభిస్తుందని భరోసా ఇచ్చారు. సీనియర్ ఉపన్యాసకురాలు ఐవీవీ సత్యవతి మాట్లాడుతూ తప్పుడు మెసేజ్‌లు వచ్చినా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్ఎస్ పీవో రత్న భారతి మాట్లాడుతూ విద్యార్థులకు ఎటువంటి చొరవ ఇవ్వరాదని సూచించారు. ప్రిన్సిపాల్ టి.రాధాకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్, తెలుగు హెచ్‌వోడీ సిహెచ్.జ్యోతి, ఉపన్యాసకులు ఐవీవీ సత్యవతి, కోమల, సరస్వతి పాల్గొన్నారు.

బాల్య వివాహం నిలిపివేత

చీడికాడ: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ లోవరాజు తెలిపారు. జె.బి.పురానికి చెందిన 9వ తరగతి విద్యార్థినికి ఈ నెల 18న వివాహం చేసేందుకు పెద్దలు ఏర్పాట్లు చేస్తుండగా, స్థానిక అధికారుల ఫిర్యాదు మేరకు ఆయన మంగళవారం గ్రామంలోని బాలిక తల్లిదండ్రులకు అంగన్‌వాడీ, గ్రామైక్య సంఘాల నేతల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ మేరకు పెళ్లి నిలుపుదల చేస్తున్నట్లు వారి నుంచి అంగీకార పత్రాలు రాయించినట్టు సూపర్ వైజర్ ఇ.ఈశ్వరమ్మ తెలిపారు.

నేటి నుంచి సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ



గన్నవరం మెట్ట వద్ద చెక్‌పోస్టు సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: ఎన్నికల కమిషనర్ ఆదేశాల ప్రకారం బుధవారం నుంచి పింఛన్లు సచివాలయాల్లోనే పంపిణీ చేస్తామని ఎంపీడీవో జాగరపు రాంబాబు తెలిపారు. గన్నవరం మెట్ట వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆయన మంగళవారం సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వాహనాల తనిఖీలు, తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మన్యపురట్ల, ఏపీపురం పంచాయతీల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రారంభించారు. వలంటీర్ల ప్రమేయం లేకుండా సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు పింఛన్లు ఇస్తారన్నారు. పంచాయతీ కార్యదర్శి సింహాద్రినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

విధిగా ఎన్నికల నియమావళి అమలు



మాట్లాడుతున్న ఏఆర్వో అల్లు సూర్యనారాయణ

రోలుగుంట: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని విధిగా అన్ని గ్రామాల్లో అమలు చేయాలని ఏఆర్వో అల్లు సూర్యానారాయణ సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎన్నికల సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఏ గ్రామాల్లో ఎన్ని శిలాపలకాలున్నాయి, ఎన్ని రాజకీయ నాయకుల విగ్రహాలు ఉన్నాయో జాబితాలు అందజేయాలని సూచించారు. ఎక్కడా రాజకీయ పార్టీల రంగులు కాని, శిలాఫలకాలపై రాజకీయ నాయకుల పేర్లు కనిపించకూడదన్నారు. విగ్రహాలకు ముసుగులు కప్పాలన్నారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజును ఆదేశించారు. ఎంపీడీవో కె.జాను లింకన్, తదితరులు పాల్గొన్నారు.

రూ.300 గిట్టుబాటయ్యేలా ఉపాధి



వేతనదారులతో మాట్లాడుతున్న ఏపీడీ మణికుమార్

రావికమతం: ఇంతవరకూ ఉపాధి రోజు వేతనం రూ.272 ఉండగా, తాజాగా రూ.28 పెంపుతో రూ.300 గిట్టుబాటు కూలికి పనిచేసుకోవాలని ఏపీడీ మణికుమార్ అన్నారు. కవగుంటలో ఉపాధి హామీ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి పనుల్లో పాల్గొనే వారంతా ఉదయం, సాయంత్రం ఎండ వేడిమి తక్కువ ఉన్న సమయాల్లో ఎక్కువగా పనిచేస్తే రూ.300 కూలి గిట్టుబాటు అవుతుందన్నారు. అధికారులు ఆ విధంగా సూచనలివ్వాలని, నీటి నిల్వ కుంటలకు, ఇంకుడు గుంతలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఒకొక్క జాబ్ కార్డుదారుకు వంద రోజుల పని కల్పించాలన్నారు. ఏపీవో దాడి వెంకట కాశీఅప్పారావు, ఈసీ కామేశ్వరరావు, టీఏ కొండాజి, రమణ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

మాకవరపాలెం: పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని సంపాదించొచ్చని హెచ్‌ఎం కె.రాము తెలిపారు. మంగళవారం తూటిపాల పాఠశాలలో అంతర్జాతీయ పిల్లల పుస్తక దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నీతి కథలు, విలువలతో కూడిన పుస్తకాలను చదవాలనే ఉద్దేశంతో 1967 నుంచి ఈ దినోత్సవం నిర్వహిస్తున్నారన్నారు. ఒక్క నిమిషంలో ఎక్కువ పదాలు చదివిన విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు లోవరాజు, సంతోషి, నారాయణరావు పాల్గొన్నారు.

సీఎం రమేష్‌కు ఓటుతో గుణపాఠం

- ఏమి అభివృద్ధి చేశారని ఓటడుగుతారు
- ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు



మాడుగుల అసెంబ్లీ అభ్యర్థి అనూరాధను పరిచయం చేస్తున్న బూడి ముత్యాలనాయుడు



జి.కొత్తపల్లి సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు



కె.కోటపాడులో మాట్లాడుతున్న బూడి

కె.కోటపాడు/చీడికాడ: అనకాపల్లి పార్లమెంట్ స్థానానికి పోటీ చేసిన స్థానికేతరులకు గతంలోనే ఓటర్లు గుణపాఠం చెప్పారని, తాజా ఎన్నికల్లో సీఎం రమేష్‌కు అదే పరిస్థితి తప్పదని వైఎస్సార్ సీపీ అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. మంగళవారం చీడికాడ మండలం జి.కొత్తపల్లి, కె.కోటపాడులో మండల కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాడుగుల అభ్యర్థి ఈర్లె అనూరాధను పరిచయం చేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రామ గ్రామాన మనం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు గుర్తు చేయాలని, మనం ఎందుకు గెలవాలో చెప్పాలన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే జన్మభూమి కమిటీలను తెస్తామంటున్నారు. ఐదేళ్లుగా తెల్లవారే సరికి ఇంటి వద్దే పింఛన్లు అందించి పింఛనదారుల మోములో చిరునవ్వులు పూయిస్తే, వలంటీర్లపై కక్షతో ఫిర్యాదు చేయించిన చంద్రబాబునాయుడు అడ్డుకున్నారన్నారు. రాబోయే పార్లమెంట్, మాడుగుల అసెంబ్లీ స్థానాల్లో తనను, అనరాధ గెలుపునకు పార్టీ కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. మాడుగుల అభ్యర్థి ఈర్లె అనూరాధ మాట్లాడుతూ తన తండ్రి కృషి, పట్టుదలను చూసి తాను అలవర్చుకున్నానన్నారు. నియోజకవర్గ ప్రజలకు సేవ చేసే భాగ్యం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారని, ఆశీర్వదించాలని కోరారు. చివర్లో బూడి 'నేను యుద్ధానికి సిద్ధం, మీరు సిద్ధమా' అంటూ చేసిన నినాదాలతో కార్యకర్తల్లో జోష్ నింపింది. జి.కొత్తపల్లి కార్యక్రమంలో ఎంపీపీ కురచా జయమ్మ, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, విశాఖ డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, దండిసురవరం కో–ఆపరేటివ్ పర్సన్ ఇన్‌చార్జి నందారపు రమణబాబు, యూత్ అధ్యక్షుడు స్వామినాయుడు, సచివాలయాల కన్వీనర్ ఈర్లె చైతన్య, కొల్లి శ్రీను, పుట్టా రాంకుమార్, కె.కోటపాడు కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీలు రొంగలి సూర్యనారాయణ, లెక్కల నాగ విజయలక్ష్మి, యువజన, మహిళా విభాగం అధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు, పైల అమ్మాజి, జేసీఎస్ మండల కన్వీనర్ ఏటుకూరి రాజేష్, సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పొట్టిదొరపాలెంలో ఘనంగా విగ్రహ ప్రతిష్ట



సారె ఊరేగింపులో గ్రామస్తులు

బుచ్చెయ్యపేట: పొట్టిదొరపాలెంలో రామాలయ విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహిస్తున్నారు. గ్రామస్తులంతా కలిసి విఘ్నేశ్వర, మణికంఠ సమేత కోదండ సీతారామస్వామి ఆలయం కొత్తగా నిర్మించారు. ఇక్కడ సోమవారం ప్రారంభమైన విగ్రహ యంత్ర శిఖర ప్రతిష్ట మహోత్సవాలు బుధవారం ముగియనున్నాయి. మంగళవారం సారె ఊరేగింపు ఘనం నిర్వహించారు. చివరి మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన, రాత్రికి ప్రత్యేక భజనలు ఏర్పాట్లు చేసినట్లు గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు.